RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 102 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 17 అక్టోబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# కొలిక్కి వచ్చినట్లేనా..!?




## హస్తిన చేరిన సీఎం, సీనియర్ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ : ఎప్పటి నుంచో తెలంగాణ క్యాబినెట్ ను విస్తరిస్తారు అనే ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్లుగానే సీఎం రేవంత్ రెడ్డి కూడా అనేక సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలి, ఎవరిని తప్పించాలనే విషయం పైన అధిష్టానం పెద్దలతో చర్చించారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తో పాటు, మరో పదకొండు మంది మంత్రులు ఉన్నారు. అయితే ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో మంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరుగుతుందని గత కొద్ది నెలలుగా ప్రచారం జరుగుతున్నా, ఏదో ఒక అడ్డంకి ఏర్పడడంతో అది వాయిదా పడుతూ వస్తోంది. జమ్ము కాశ్మీర్ , హర్యానా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు బిజీగా ఉండడంతో, తెలంగాణ క్యాబినెట్ విస్తరణ వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ ఎన్నికలు పూర్తి కావడంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , శ్రీధర్ బాబు, టి. పేసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు, ఇతర ముఖ్య నేతలు కూడా ఢిల్లీ వెళ్తుండడంతో , క్యాబినెట్ విస్తరణకు సంబంధించిన వ్యవహారాన్ని తేల్చుకునేందుకే వీరంతా ఢిల్లీకి వెళుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. సిడబ్ల్యూసి సమావేశంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి క్యాబినెట్ విస్తరణ పైనా, అధిష్టానం పెద్దలతోనూ చర్చించనున్నట్లు సమాచారం. ఈ విస్తరణలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. తాజాగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా తెలంగాణ క్యాబినెట్ విస్తరణ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. క్యాబినెట్ విస్తరణ ఇక ఎంతో దూరంలో లేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇక మంత్రివర్గంలో స్థానం కోసం సీనియర్ నేతలు చాలామంది పోటీ పడుతున్నారు. అదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్ సాగర్ రావు తో పాటు, వివేక్ , వినోద్ లు ప్రయత్నిస్తున్నారు . దీంతో వారికి పెట్టేందుకు సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు మంత్రి పదవిని ఆశిస్తున్నాను అని మీడియా ముందు వచ్చి మరి చెప్పారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రేమ్ సాగర్ రావు కి కౌంటర్ గా వివేక్ , వినోద్ సోదరులు ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం లాభియింగ్ చేస్తున్నారట. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గెలిచిన సీనియర్ నాయకుల్లో మాజీ మంత్రి, ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంత్రివర్గ విస్తరణలో అవకాశం దొరుకతుందని ధీమాగా ఉన్నారు. ఇదే జిల్లా నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారు.




## ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టులో షాక్..

### వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశాలు

క్యాడర్ వివాదంలో ఏడుగురు ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. తమ బదిలీలపై క్యాట్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులకు న్యాయస్థానంలో నిరాశ తప్పలేదు. ఐఏఎస్ అధికారులు వేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు డిస్మిస్ చేసింది. వెంటనే ఏడుగురు అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. దీంతో హైకోర్టులోనూ వారికి ఊరట దక్కలేదు. క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్ (తెలంగాణ), సి.హరికిరణ్, లోతేటి శివశంకర్, జి.సృజన(ఏపీ) తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు.. క్యాట్ ఆదేశాలను సమర్థించింది. డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది.

**హైకోర్టు కీలక వ్యాఖ్యలు..** ఐఏఎస్ అధికారుల లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాసేవ కోసమే ఐఏఎస్‌లు ఉన్నారని వ్యాఖ్యానించింది. కేంద్రం ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లాలని సూచించింది. ట్రిబ్యునల్ పిటిషన్ కొట్టివేసిందని కోర్టులకు రావడం సరైన నిర్ణయం కాదని పేర్కొంది. మరోవైపు క్యాట్‌లో నవంబర్ నాలుగో తేదీన విచారణ ఉందన్న ఐఏఎస్ అధికారుల తరుపు న్యాయవాది.. ఈ పదిహేను రోజుల పాటు రిలీవ్ చేయవద్దని కోరారు. అయితే స్టే ఇస్తూ పోతే ఈ వ్యవహారం ఎప్పటికీ తేలదన్న హైకోర్టు.. క్యాట్‌లోనూ సీనియర్ అధికారులు ఉంటారని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సమస్య మరింత తీవ్రతరం అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. క్యాట్ ఆదేశాలను సమర్థిస్తూ ఐఏఎస్ అధికారుల పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

**రిపోర్టు చేయాలంటూ..** ఐఏఎస్ అధికారులు వెంటనే డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని హైకోర్టు సూచించింది. బాధ్యతాయుతమైన అధికారులుగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని అభిప్రాయపడింది. మరోవైపు డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం అక్టోబర్ 16 అంటే ఇవాళ సాయంత్రంలోగా వారంతా వారి సొంత రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. క్యాట్ సైతం ఇవే ఆదేశాలు జారీ చేసింది. క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించినా ఊరట దక్కలేదు.

**ముందుగా క్యాట్‌లో..** ఏపీ విభజన సందర్భంగా జరిగిన క్యాడర్ కేటాయింపులకు విరుద్ధంగా తెలంగాణ, ఏపీలో పనిచేస్తున్న ఏడుగురు ఐఏఎస్ అధికారులు తమ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేయడంతో.. అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. అయితే తమకు కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లిపోవాలని ఐఏఎస్ అధికారులకు క్యాట్ స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారులు ఇళ్లలోనే కూర్చొని సేవ చేస్తామంటే కుదరదని వ్యాఖ్యానించింది. ఈ నెల 16న ఎక్కడి అధికారులు అక్కడికి వెళ్లిపోవాలంటూ డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి క్యాట్ నిరాకరించింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు ఏపీకి.. ఏపీలో పనిచేస్తున్న వారు తెలంగాణకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. తాము ఎక్కడ పనిచేస్తున్నామో అక్కడే ఉంటామని.. డీవోపీటీ ఇచ్చిన ఆర్డర్‌ను కొట్టేయాలని పేర్కొంటూ ఏడుగురు ఐఏఎస్ అధికారులు హైదరాబాద్ క్యాట్‌లో పిటిషన్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఐఏఎస్ అధికారుల తరపు లాయర్ల వాదనలతో ఏకీభవించని క్యాట్ తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.



## మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

మెదక్ : జిల్లాలోని శివంపేటలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నారు. ఉసిరికపల్లి వద్ద వేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రహదారిపైన ఉన్న గుంతలో పడి గాల్లోకి ఎగిరిపడింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొట్టి.. కాల్వలోకి పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యారు. ఉసిరికపల్లి నుంచి వెల్దుర్తి వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.

మృతదేహాలను స్వాధీనం చేసుకుని, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను పాముబండ తండా, రత్నాపూర్, తాళ్లపల్లి వాసులుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# ఆందోళన వద్దు

## హైదరాబాద్ బస్తీల్లో ఉండే ప్రజలకు అండగా ఉంటాం..

## రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతాం

## బస్తీ వాసుల్లో భరోసా నింపిన కేటీఆర్!

హైదరాబాద్ : హైదరాబాద్ బస్తీల్లో ఉండే పేద ప్రజలకు అండగా ఉంటాం.. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలు ఎవరూ ఆందోళనకు గురికావొద్దని, అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మరి ముఖ్యంగా మూసీ నది పరివాహక ప్రజలకు 50 ఏండ్ల కిందట ప్రభుత్వమే పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చింది. వారి చేత నల్లా బిల్లు, కరెంట్ బిల్లు కట్టించుకుంది. ఇవాళ్నేమో నోటీసులు ఇవ్వకుండా ఇండ్లు కూలగొడుతామని దుందుడుకుగా వ్యవహరిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. మూసీ సుందీరకరణ, హైడ్రా ఏదైనా కావొచ్చు.. ఏదైనా సరే.. నిర్దిష్టమైన ఆలోచన, పద్ధతి, ప్రణాళిక లేదు. హైడ్రాను బిల్డర్లను, పెద్ద పెద్ద వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేసి, బెదిరించి వసూళ్లు చేయడానికి వాడుతున్నారని తెలుస్తోంది. ఇది మా పార్టీ స్థిరమైన నిర్ణయం కూడా అని కేటీఆర్ పేర్కొన్నారు.

**కొత్తగా ఎస్టీపీల కోసం ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు :** మూసీ పేరిట జరుగుతున్న దోపిడీ ఏదైతే ఉంది దాన్ని వివరంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. హైదరాబాద్ నగరంలో వంద శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు పూర్తయ్యాయి. కొన్ని చివరి దశలో ఉన్నాయి. మొన్న ఉప్పల్ నియోజకర్గంలో సీవరేజ్ ప్లాంట్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కూకట్‌పల్లి, ఫతేనగర్‌లో ఎస్టీపీలు పూర్తయ్యాయి. అంబర్‌పేటలో పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వీటి ద్వారా శుద్ధమైన నీరు దిగువకు పోతోంది. గత ప్రభుత్వాలు చేయలేని పనిని కేసీఆర్ చేశారు. ఇది వాస్తవం.. కొత్తగా ఎస్టీపీల కోసం ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఈ రెండు పనులు చేస్తే.. ఆటోమేటిక్‌గా నల్లగొండ జిల్లాకు శుద్ధ జలాలు :** కొండపోచమ్మ సాగర్ నుంచి ఉస్మాన్ సాగర్‌లోకి నీళ్లు తేవడానికి దాన్ని మూసీకి అనుసంధానం చేయడానికి 1100 కోట్లకు గతంలో కేసీఆర్ కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఎస్టీపీలు పూర్తి చేసి, మూసీ ద్వారా గోదావరి జలాలను తరలిస్తే.. ఈ రెండు పనులు చేస్తే.. ఆటోమేటిక్‌గా శుద్ధ జలాలు నల్లగొండ జిల్లాకు పోతాయి. మీరు కొత్తగా లక్షా యాభై వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్లగొండకు శుద్ధమైన జలాలు ఇస్తున్నాం అని సీఎం సన్నాయి నొక్కులు నొక్కుతూ.. పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**మానవీయ కోణంలో కేసీఆర్ ఆలోచించారు.. పేదవాళ్ల కడుపు కొట్టలేదు :** మూసీ సుందరీకరణ విషయంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక ప్రతిపాదన తీసుకొచ్చాం. 100 శాతం ఎస్టీపీలు చేస్తున్నాం. నాగోల్‌లో అతి తక్కువ ఖర్చుతో సుందరీకరణ చేశాం. మిగతా పనులకు ఆమోదం తెలపండి అని కేసీఆర్ దగ్గరకి వెళ్లాం. కేసీఆర్ అర గంట చర్చించిన తర్వాత.. ఎక్కువ మంది పేదలకు నష్టం జరిగేలా ఉంది. పేదలకు నష్టం కాకుండా.. వాళ్ల పొట్ట మీద కొట్టకుండా.. ఊరు అవతలకు పంపకుండా.. తిరిగి ప్రతిపాదన సిద్ధం చేయాలని చెప్పారు. మానవీయ కోణంలో కేసీఆర్ ఆలోచించారు. నాగోల్‌లో నాలుగైదు కిలోమీటర్లు వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ ఎయిర్ జిమ్స్, పార్కులు, ఉప్పల్ భగయాత్‌లో పక్కన సుందరీకరణ చేశాం. పేదవాళ్ల కడుపు కొట్టలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీ హయాంలో శత్రువులు పెరుగుతున్నారా ?


కేంద్రంలో నరేంద్ర మోడీ ఏలుబడిలో భారత్ కీరిత్ శిఖరాగ్రానికి చేరింది. భారత్ పాత్ర లేకుండా అంతర్జాతీయ వేదిక మీద ఏ కార్యక్రమం జరగడం లేదు. అగ్ర రాజ్యాలు ముఖ్య రాజ్యాలు అన్నింటికీ భారత్ కావాల్సిన దేశంగా ఉంది. అటు అమెరికా అయినా ఇటు రష్యా అయినా భారత్ మాట వినాలని చూస్తున్నాయి. అదే విధంగా రష్యా ఉక్రెయిన్ మధ్య భీకరమైన పోరు సాగుతున్నా రెండు దేశాలూ భారత్ కి మిత్రులుగానే ఉంటూ వస్తున్నాయి. అదే విధంగా ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య సమరం సాగుతున్నా ఆ రెండు దేశాలూ భారత్ కి దగ్గర అయినవే. ఇలా మోడీ పదేళ్ళ ప్రధానమంత్రిత్వంలో దాదాపుగా తిరగని దేశమే లేదు. ఆఫ్రికన్ దేశాలకు జీ 20లో సభ్యత్వం ఇప్పించిన ఘనత కూడా మోడీ దక్కించుకున్నారు. అలాగే ప్రపంచ దేశాలకు కరోనా వేళ టీకాలు సరఫరా చేయడం ద్వారా భారత్ కీర్తిని పెంచారు. ఇలా ఇన్ని చేసినా కొన్ని విషయాలో మాత్రం భారత తన పోరు తనదే అన్నట్లుగానే ఉంది. భారత్ కి పాకిస్తాన్ నిత్య శత్రువు. ఎందుకు అంటే భారత్ నుంచి విడిపోయిన దాయాది కాబట్టి. భారత్ మంచిని ఎపుడూ పాక్ కోరుకోవడం లేదు, ఆ సంగతి అందరికీ తెలుసు. ఇక మోడీ ప్రధాని అయ్యాక చైనాతో కూడా భారత్ ఈ ఇబ్బందులు వస్తున్నాయి. చైనా అంతవరకూ నెమ్మదిగా ఉందా లేక పరోక్షంగా గోతులు తవ్విందా అన్నది పక్కన పెడితే చైనా బోర్డర్ దాటుతోంది. అరుణాచల్ ప్రదేశ్ సహా లడఖ్ ప్రాంతాలు తమవే అని క్లెయిం చేస్తోంది. ఆ వివాదం అలాగే ఉంది. ఇక చూస్తే మిత్రుడు అనుకున్న బంగ్లాదేశ్ లోనూ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. అక్కడ భారత్ కి నేస్తంగా ఉండే షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలగొట్టి సైన్యం సహాయంతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అయింది. దాని వెనక చైనా ఉందా మరే దేశం ఉందా లేక అక్కడ మిలటరీ పాక్ సాయం తీసుకుని తమ రాజకీయాన్ని మార్చుకుందా అన్నది వేరే అంశాలు కానీ ఇపుడు కొత్తగా మరో పొరుగు దేశం ప్రత్యర్ధి పాత్రలోకి వెళ్ళిపోయింది. ఈ విషయాలు ఇలా ఉంటే కెనడా భారత్ మీద కక్ష కట్టేసింది. ఎందుకో తెలియదు కానీ జీ 20 దేశాల సమావేశానికి భారత్ వచ్చిన కెనడా ప్రధాని ట్రూడో భారత్ మీద కక్ష గట్టినట్లుగా వ్యవహరించారు. తన సొంత విమానంలోనే ఆనాడు ఆయన భారత్ నుంచి వెళ్లారు. ఇక భారత్ లో ఖలీస్థాన్ పేరుతో ఉద్యమాన్ని చేయలను చూస్తున్న ఉగ్ర మూకలకు కెనడా మద్దతు ఇస్తోంది అని చెబుతున్నారు. అలా పంజాబ్ వేర్పాటు వాదులకు తన దేశంలో ఆతిథ్యం ఇస్తున్న కెనడా ప్రధాని భారత్ మీద నిప్పులు చెరుగుతున్నారు భారత్ వంటి పెద్ద దేశం పట్ల కూడా ఆయన లెక్కలేని తనంతో ప్రవర్తిస్తున్నారు అంటే వెనకాల వ్యూహాలు ఏమిటో అర్ధం కావడంలేదు అని అంటున్నారు భారత్ తో మిత్రుత్వం కోరుకునే దేశాలు ఈ రోజు అంతర్జాతీయ సమాజంలో ఎక్కువగా ఉండగా శతృత్వాన్ని ట్రుడో కోరుకుంటున్నారు అంటే ఆయన అజెండా ఏమిటో తెలియాల్సి ఉంది. గతంలోనూ కెనడాతో భారత్ కి అంత సఖ్యత లేకున్నా ఇపుడు మరీ ఎదురు నిలిచి కెనడా చేస్తున్న ఈ రాజకీయం దౌత్యపరమైన దుర్నీతి భారత్ ని కలవరపెడుతోంది. కెనడాకు భారత్ గట్టిగానే బదులిస్తోంది. కౌంటర్ చేస్తోంది. అయితే కెనడాతో ఎందుకు ఈ పేచీ వస్తోంది అన్నదే చూడాల్సి ఉంది. కెనడాలో స్థిరపడిన సిక్కులు ఎక్కువగా ఉంటారు. వారి ఓట్ల కోసమే ఈ రాజకీయం అని అంటున్నా భారత్ ప్రతిష్ట అంతర్జాతీయంగా వెలిగిపోతున్న దశలో కావాలనే కార్నర్ చేయడానికి ఈ ప్రయత్నాలు అని కూడా అంటున్నారు. ఏది ఏమైనా కెనడా పోకడల పట్ల భారత్ ధీటుగానే బదులిస్తోంది. కేవలం నాలుగు కోట్ల జనాభా కలిగిన అతి చిన్న దేశం అయిన కెనడాతో భారత్ కి విభేదాలు వల్ల ప్రస్తుతానికి ఇబ్బందులు లేకపోయినా అంతర్జాతీయంగా అందరి నేస్తంగా అనిపించుకుంటున్న వేళ ఇది మచ్చగా మారుతోంది అని అంటున్నారు. మొత్తానికి చూస్తే భారత దౌత్య నీతి విదేశాంగ విధానం భేష్ అని నిపుణులు చెబుతున్నా కూడా కొన్ని దేశాలు మాత్రం ప్రత్యర్ధులుగా మారడం మోడీ పదేళ్ల పాలనలో ఈ విధంగా జరగడం పట్ల చర్చ అయితే సాగుతోంది.

# పల్లెకు మార్గం.. సుగమం



తాండూరు : గ్రామీణ ప్రజల ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. అనుబంధ రహదారుల నిర్మాణ కల సాకారం కానుంది. వెరసి తక్కువ దూరం ప్రయాణించి పల్లెలకు చేరుకునే వెసులుబాటు లభించనుంది. సమయం ఆదా కానుంది. రహదారుల మంజూరు నేపథ్యంలో కథనం. ఇతర గ్రామాల మీదుగా రావాల్సిన పరిస్థితి: జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు అనుబంధ దారులు అధ్వానంగా ఉన్నాయి. ఉదాహరణకు.. కొడంగల్, బషీరాబాద్, పెద్దేముల్, వికారాబాద్ మండలాల్లో మారుమూల తండాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే వీటిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.
మోమిన్‌పేట మండల పరిధిలో అనుబంధ తండాలకు మట్టిదారుల్లో వెళ్లలేక ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు.
తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 13 గ్రామాలు కొనసాగుతున్నాయి. ఇవి ఒకదానికికొకటి పక్కపక్కనే ఉన్నప్పటికి రహదారి సదుపాయంలేక ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దీంతో వాహనదారులపై రవాణా భారం పడుతుండగా సమయం వృథా అవుతోంది. మండలంలోని నారాయణ్‌పూర్–పాతతాండూరు దూరం 5.10కి.మీ. ఉండగా రహదారి నిర్మించని కారణంగా యాలాల మండలం మీదుగా 16 కి.మీ. ప్రయాణించి గ్రామానికి చేరుకుంటున్నారు. తాజాగా ఆయా రహదారుల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.16.30కోట్లు నిధులతో 22.15కి.మీ మేర తారు రహదారులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నాం: గ్రామాలకు కొత్తగా అనుబంధ రహదారులు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. మట్టిదారులు, పానాది మార్గాల్లో తొలిసారిగా తారు రహదారులు నిర్మింపజేస్తాం. త్వరలోనే పల్లెలకు కొత్త తారు రహదారులు అందుబాట్లోకి వస్తాయి.
నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు.

# ఎక్కడి దస్త్రం అక్కడే



కరీంనగర్ : నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం గాడీ తప్పింది. పన్నుల వసూలు, కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, వాణిజ్య భవనాల రీఅసెస్‌మెంట్ పనులు మినహాయిస్తే మిగతా దస్త్రాలన్నీ పెండింగ్‌లో ఉంటున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి విభాగం అధికారి వరకు దస్త్రం పెండింగ్‌లోనే లేదని దాటేస్తుండగా దరఖాస్తుదారులు మాత్రం పనులు చేయాలని కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు.

నెలల తరబడి పెండింగ్

రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లతోపాటు నలుగురు రెవెన్యూ అధికారులు(ఆర్.ఐ), ఒక ఆర్వో ఉన్నారు. పేరుమార్పిడి, పన్ను మదింపు వంటి అర్జీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా ఇటీవల నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలుస్తోంది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్నింటికీ కొర్రీలే

పేరుమార్పిడి, ఇతరత్రా పనుల కోసం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు అవసరమైన కాగితాలతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కడ లేని నిబంధనలు జత చేసి, లేని కాగితాలు తీసుకు రావాలని ఆదేశిస్తుండటం, కొర్రీలతో అర్జీదారులు నానావస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు అడ్డదారుల్లో వచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేసుకుంటున్నారు. పైసలు ఇవ్వనిదే దస్త్రాలు కదలడం లేదని పలువురు పాలకవర్గ సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

కొన్ని దృష్టాంతాలు ఇలా..

తీగలగుట్టపల్లి ప్రాంతవాసి ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేశారు. దీనికి కావాల్సిన దరఖాస్తుతోపాటు రిజిస్ట్రేషన్ దస్తావేజులు జత చేశారు. నిబంధనల ప్రకారం అంటూ ఆ దస్త్రాన్ని న్యాయ సలహా కోసం పంపించారు. దీనికి స్టాంపు డ్యూటీ రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుందని న్యాయ సలహాదారు చెప్పడంతో దరఖాస్తుదారు వెనక్కి తగ్గారు. లింకు కాగితాలు, రిజిస్ట్రేషన్ పక్కాగా ఉండగా కొర్రీ పెట్టడంలో మతలబు ఏమిటో తెలియక ఆ దస్త్రాన్ని అలాగే రెవెన్యూ విభాగంలో ఉంచారు.
కమాన్ రోడ్డులో పేరు మార్పిడి చేసుకోగా బైఫరికేషన్ నంబర్ కోసం ఒకరు దరఖాస్తు చేశారు. ఒకరిపైనే పన్ను భారం పడుతుండగా కొనుగోలుదారుకు నంబర్ ఇవ్వాల్సి ఉండగా 9 నెలలుగా తిప్పుతున్నారు. దేనికోసం ఇబ్బందులు పెడుతున్నారని నిలదీసినా అధికారుల దగ్గరి నుంచి సమాధానంలేదని దరఖాస్తుదారు అంటున్నారు.
బుట్టిరాజరాంకాలనీకి చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పేరు మార్పిడికి 3 నెలల కిందట దరఖాస్తు చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారి పరిశీలించాల్సి ఉండగా.. వెళ్లడంలేదు.
ఉస్మాన్‌పురకు చెందిన ఒక ఇంటి యజమాని పేరు మార్పిడి చేసుకున్నారు. బై ఇంటి నంబర్ ఇచ్చేందుకు ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు నెలలుగా ఇంటి నంబర్ మాత్రం రావడంలేదు. ఎందుకు జాప్యం అవుతుందని పేర్కొన్నా సమాధానం దాటేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.
విద్యానగర్‌కు చెందిన ఒకరు ఆస్తిని గిఫ్ట్ చేస్తూ రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడే ఆన్‌లైన్‌లో పేరుమార్పిడి జరిగిపోగా.. నగరపాలికలో తిరస్కరించారు. అన్ని ఆధారాలతో రిజిస్ట్రేషన్ జరిగిపోగా.. దేనికోసం ఆరా తీస్తే కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ తప్పనిసరి అని మెలిక పెట్టారు. రెవెన్యూ శాఖలో మాత్రం సాధారణ ప్రజలకు ఈ సర్టిఫికెట్ జారీ చేయడం లేదు. ఇలా 20 దరఖాస్తులను రిజెక్ట్ చేయడంతో ఆ సర్టిఫికెట్‌ను నగరపాలక అధికారులే ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నోటీసులు ఇస్తున్నారు
–స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, నగరపాలిక
ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దస్త్రాలు పెండింగ్‌లో లేవు. మిగతా వాటికి దస్త్రాలు సరైన విధంగా లేకపోతే వాటికి నోటీసులు ఇస్తున్నారు. కొన్ని మ్యుటేషన్ ఫీజులు చెల్లించకపోవడంతో పెండింగ్‌లో ఉంటున్నాయి.

# సీఐ.. ఇక ఠాణా బాస్

భువనగిరి : ఎస్సైలు.. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)లుగా ఉన్న పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచుతున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమిస్తూ బలోపేతం చేస్తున్నారు. జిల్లాలో బీబీనగర్, ఆత్మకూరు(ఎం) రెండు పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే సీఐలను నియమించారు. ఇటీవల వారు బాధ్యతలు చేపట్టారు. త్వరలో మరిన్ని పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో రాచకొండ కమిషనర్ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నడుస్తోంది.
రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా జోన్‌లో ప్రస్తుతం మూడు డివిజన్లు, నాలుగు సర్కిళ్లు, 18 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. స్టేషన్ల సీఐలను ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రతిపాదనలో భాగంగా మొదటగా రెండు స్టేషన్లను ఎస్‌హెచ్‌వోలును నియమించారు. భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్లకు మాత్రమే ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. మిగతా పోలీసు స్టేషన్లు నాలుగు సర్కిళ్లలో పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆయా స్టేషన్లకు ఎస్సైలు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలో మూడు నుంచి ఐదు పోలీస్ స్టేషన్ల వరకు ఉన్నాయి.
భువనగిరి సర్కిల్ పరిధిలో భువనగిరి గ్రామీణం, బీబీనగర్, బొమ్మలరామారం మూడు స్టేషన్లు ఉండేవి. ప్రస్తుతం భువనగిరి గ్రామీణ, బొమ్మలరామారం స్టేషన్లు మాత్రమే భువనగిరి రూరల్ సీఐ పరిధిలోకి తీసుకొచ్చి రెండు ఠాణాలకు కలిపి సీఐని నియమించారు. రామన్నపేట సర్కిల్ పరిధిలో ఆత్మకూరు(ఎం) ఉంది. బీబీనగర్, ఆత్మకూరు(ఎం) రెండు స్టేషన్లలో ఇప్పటి వరకు ఎస్సైలు మాత్రమే స్టేషన్ బాస్‌గా ఉన్నారు. రెండు స్టేషన్లకు సీఐ స్థాయికి పెంచి అధికారులను నియమించారు.

కేసుల నమోదు ఎక్కువే

యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్ సరిహద్దు కావడంతో భూ సంబంధిత కేసులు, సొత్తు దొంగతనం, ఇతర నేరాలు ఎక్కువగానే నమోదవుతుంటాయి. భూములు సరిహద్దు గొడవలు, లావాదేవీలలో తలెత్తే సమస్యలతో నిత్యం పదుల సంఖ్యల పోలీసేస్టేషన్లకు బాధితులు వస్తుంటారు. వీటితో పాటు చోరీలు, మిస్సింగ్‌లు ఎక్కువగా నమోదువుతుంటంతో కొన్ని స్టేషన్ల ఎస్సైలకు పనిభారం ఉండటం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం చోటుచేసుకుంటున్నాయి.




ప్రస్తుతం వలిగొండ, ఆలేరు, మోత్కూరు, బొమ్మలరామరాం, రామన్నపేట వంటి స్టేషన్ల కింద మండల కేంద్రంతో పాటు 35 పైగా గ్రామాలు ఉన్నాయి. ఆయా స్టేషన్ల వివిధ ఫిర్యాదులు, గొడవలు, ఇతర సమస్యలతో పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులు ఎక్కువగానే ఉంటారు.

జిల్లాలో పోలీస్ శాఖ స్వరూపం ఇది..
జోన్: యాదాద్రి
డివిజన్లు : భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట
సర్కిళ్లు: భువనగిరి గ్రామీణం, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, రామన్నపేట
భువనగిరి గ్రామీణం: భువనగిరి గ్రామీణం, బొమ్మలరామారం
యాదగిరిగుట్ట రూరల్ : రాజపేట, ఆలేరు, తుర్కపల్లి, మోటకొండూరు, గుండాల
రామన్నపేట: రామన్నపేట, అడ్డగూడూరు, మోత్కూరు, ఆత్మకూరు, వలిగొండ
చౌటుప్పల్: చౌటుప్పల్, పోచంపల్లి, నారాయణపురం

# కాజ్‌వేలు ధ్వంసం.. మరమ్మతులు పూజ్యం

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ పరిధిలోని బాకురుపల్లి, బాకురుపల్లితండా గ్రామాల నడుమ రోడ్డు, కల్వర్టు ధ్వంసమై మూడేళు అవుతుంది. ప్రస్తుతం కాజ్‌వే కూలిపోయే దశకు చేరుకుంది. కింది భాగంలోని మట్టి, కంకర కొట్టుకుపోవడంతో సీసీ గాలిలో వేలాడుతూ ప్రమాదభరితంగా మారింది. భారీ వాహనాలు వెళితే పూర్తిగా నేలమట్టమయ్యే దుస్థితి నెలకొంది. అయినా కాజ్‌వేను ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు.మండల కేంద్రం నుంచి సత్తంగ సదనం మీదుగా కోరుట్లపేటకు వెళ్లే రోడ్డులో ఓ కల్వర్టు కిందిభాగం కొట్టుకుపోగా సీసీ వేలాడుతోంది. దీనిపై భారీ వాహనాలు వెళితే కూలిపోయే ప్రమాదం నెలకొంది. గతంలో ఓ ట్రాక్టర్ కల్వర్టుపై నుంచి నీటిలో పడిపోగా త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. నాయకులు,



అధికారులు కల్వర్టును పరిశీలించడమే తప్ప నిధుల మంజూరుకు ఎలాంటి కృషి చేయలేదు. గత మూడు నాలుగేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల తోపాటు కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే దశకు చేరుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది.అల్మాస్‌పూర్ నుంచి బుగ్గరాజేశ్వరతండాకు వెళ్లే రహదారిలో వంతెన ఓవైపు పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టుల వద్ద మట్టి కోతకు గురైంది. కనీసం మట్టి పోసి, తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి నుంచి కోరుట్లపేటకు వెళ్లే రెండు వరుసల రహదారిలో కోరుట్లపేట వద్ద కాజ్‌వే, అలాగే మండల కేంద్రం నుంచి బండలింగంపల్లికి వెళ్లే రోడ్డులో రెండు కాజ్‌వేలు, అక్కపల్లి వద్ద కాజ్‌వే ఏటా వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. వాటి మీదుగా వరద ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు స్తంభించిపోతున్నాయి. కాజ్‌వేల స్థానంలో వారధులు నిర్మించాలనే ప్రజలు, ప్రయాణికుల కోరిగా కలగానే మిగిలిపోయింది.
ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై ఉన్న కాజ్‌వే ఇది. 2020లో రూ. 20 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మించారు. నిర్మాణంలో సాంకేతిక లోపాల వల్ల వరద తాకిడికి 2021లో కొట్టుకుపోయింది. రూ. లక్షలు వెచ్చించి, మరమ్మతు చేశారు. గత సంవత్సరం, ఈ ఏడాది వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
ప్రతిపాదనలు పంపించాం– శ్రీనివాస్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ
కాజ్‌వేల మరమ్మతు కోసం ఎఫ్‌డీఆర్ నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. బాకురుపల్లి నుంచి బాకురుపల్లితండా మధ్య కాజ్‌వే మరమ్మతుకు రూ. 4 లక్షలు, కోరుట్లపేట పారేటి వాగుపై కాజ్‌వేకు రూ. 5 లక్షలు కావాలని కోరాం. పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై వంతెన నిర్మాణానికి రూ. 6 కోట్లు, రాగట్లపల్లి నుంచి నారాయణపూర్ వెళ్లే దారిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమవగా కొత్తగా తారురోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు, అక్కపల్లి వద్ద వంతెనకు రూ. 1.50 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

# ఉత్కంఠకు తెర

హుజూర్‌నగర్ : మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..
రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.
వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాములలో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాములో నిల్వ చేసి నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గోదాముల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కరసత్తు చేయాల్సి ఉంది.

# మురుగుకు మంగళం.. చెరువులకు అందలం

హైదరాబాద్: నగరంలోని చెరువులకు మహర్దశ పట్టనుంది. సహజ పద్ధతుల్లోనే మురుగుతో నిండిన చెరువులను మంచినీటి జలవనరులుగా తీర్చిదిద్దేందుకు హైడ్రా త్వరలో పనులు ప్రారంభించనుంది. బెంగళూరులో కలుషిత నీటితో కాలుష్య కాసారంలా మారిన తటాకాలు, ఆక్రమణలతో కనుమరుగైన చెరువులకు అక్కడి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కొన్నేళ్లుగా ప్రాణం పోస్తున్నాయి. ఇంజినీర్ ఉద్యోగాన్ని వదిలేసి చెరువులను కాపాడటమే లక్ష్యంగా 2017 నుంచి ఆనంద్ మల్లిగవాడ్ ఒక్కరే 35 తటాకాలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. అలాంటి పరిస్థితి నగరంలో సాకారం చేసేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుంది.

సహజ పద్ధతిలో మురుగుశుద్ధి



చెరువుల వద్ద కోట్ల రూపాయలు ఖర్చు చేసి మురుగు శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం, చుట్టూ కాలిబాటల అభివృద్ధికి రూ.కోట్లలో వెచ్చిస్తున్నారు. దుర్గం చెరువు అభివృద్ధికి ఓ కార్పొరేట్ సంస్థతో రూ.60కోట్లకుపైగా జీహెచ్ఎంసీ ఖర్చు చేయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో.. బెంగళూరులో నామమాత్రపు ఖర్చుతో జలవనరులు మెరుగుపడుతుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది.

దశలవారీగా వడపోత..

చెరువులకు వరద నీటితోపాటు, మురుగునీటి నాలాలు ఉంటాయి. విస్తీర్ణం ఆధారంగా ఆయా చెరువులను ఆనంద్ పూర్తిగా తవ్వేవారు. పూడిక తొలగించి, క్రమపద్ధతిలో చెరువు అడుగు భాగాన్ని చదును చేసి, చుట్టూ కట్ట నిర్మించడం మొదటి దశ.

కట్ట నిర్మాణం పూర్తయ్యాక చెరువు మధ్యలో మరో కట్ట కడతారు. ఓ వైపు వరదనీరు, మరోవైపు మురుగునీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేస్తారు. చెరువులోకి మురుగు వ్యర్థాలను తీసుకొచ్చే అన్ని పైపులైన్లను ఓ ప్రాంతంలో అనుసంధానిస్తారు. ఆ ప్రాంతం తటాకం కంటే ఎత్తులో ఉంటుంది. ఆ క్రమంలో మరో మూడు వడపోత కుంటలను నిర్మిస్తారు. మొదటి కుంటలో చెట్లు, రెండో కుంటలో పెద్ద రాళ్లు, మూడో కుంటలో కంకర, ఇసుక మిశ్రమాన్ని భారీగా ఉంచుతారు. దీంతో మురుగునీరు చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తూ.. రాళ్లు, కంకర, ఇసుక, వేర్వేరు మొక్కలను దాటుకుంటూ పరిశుభ్రంగా మారుతుంది. అదే పద్ధతిలో మొదటి దశ కింద మాదాపూర్ సున్నం చెరువు, గగన్‌పహాడ్ అప్పా చెరువు, ప్రగతినగర్ ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# జయప్రదమైన.. ఆలోచన

చౌటుప్పల్ : మహిళలు మక్కువతో కొనుగోలు చేసి, ఇష్టంగా ధరించే ఖరీదైన చీరలు, రవికల అందం, ఆకర్షణ తగ్గకుండా సంరక్షించడాన్ని స్వయం ఉపాధిగా ఎంచుకున్నారు అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్ల జయప్రద. ఈమె మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు. 2002లో గ్రామంలోని పది మంది మహిళలతో కలిసి శ్రీలక్ష్మి-1 పొదుపు సంఘం సభ్యురాలిగా చేరారు. సంఘం సమావేశాల్లో కేవలం పొదుపు చేయడం గురించే కాకుండా మద్యనిషేధం, భావిపౌరుల సంక్షేమం, వనాల పెంపకం, జల సంరక్షణ అంశాలపై చర్చించేవారు. పొదుపు సొమ్మును, బ్యాంకు నుంచి రుణ సహాయాన్ని కలిపి తమ కుటుంబ సంక్షేమానికి, ఆదాయ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. సంఘం ఇచ్చిన చైతన్యంతో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధితోపాటు కొందరికి పని కల్పించాలని ఆలోచించారు.

చీరలు, రవికలు, వివిధ రకాల వస్త్రాలను ఆధునిక పద్ధతిలో శుభ్రం చేయడం, కొత్తవాటిలా మెరిసేలా పాలిషింగ్ చేయడం, మరకలను తొలగించడం, డ్రైక్లీనింగ్ లాంటి వస్త్ర సంరక్షణ పనులు చేయడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. తన వ్యాపార ఆలోచనను స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులకు వివరించడంతో వారు ప్రోత్సహిస్తూ రూ.4లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఆ డబ్బుతో యంత్రాలను కొనుగోలు చేసి 'శ్రీదత్త శారీ కేర్ సెంటర్'ను చౌటుప్పల్‌లో ప్రారంభించారు. తనతోపాటు మరో మహిళకు ఉపాధి కల్పించారు.

వస్త్రాలు మహిళల గౌరవాన్ని పెంచుతాయి



– నల్ల జయప్రద, శ్రీదత్త శారీ కేర్ సెంటర్ నిర్వాహకురాలు

మహిళలు, పురుషులు తమ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకునేలా ఆధునికమైన, ఖరీదైన వస్త్రాలను ధరిస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాలకు విలువైన పట్టుచీరలు, నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వాటిని ధరించిన తర్వాత ఆధునిక పద్ధతుల్లో శుభ్రం చేయాల్సి ఉంటుంది. మరకలు పడితే, వాటికున్న వెండి జరి, అలంకరణ రంగు మారి, మాసిపోయినట్టు అవుతుంది. వాటిని కొత్త వాటిలా తయారు చేయకపోతే వన్నె తగ్గుతుంది. ఈ పనులు చేయడం ద్వారా పరోక్షంగా మహిళలకు ఉపయోగపడవచ్చు. ప్రత్యక్షంగా ఉపాధి పొందవచ్చునని ఆలోచించి ఈ సెంటర్‌ను ప్రారంభించాను.

ఉపాధి పొందుతునా.. – జె.సంధ్య, బీఎస్సీ పట్టభద్రురాలు, చౌటుప్పల్

బీఎస్సీ చదివా. ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఏదైనా ఉద్యోగం చేయాలని అనుకుంటున్న సమయంలో ఈ సెంటర్‌లో సహాయకురాలిగా పని చేసేందుకు అవకాశం దొరికింది. ఇంటి పనులయ్యాక తీరిక సమయంలో ఇక్కడికొస్తున్నా. పని నేర్చుకుంటూ నిర్వాహకురాలికి సహాయ పడుతున్నా. ఇది గౌరవప్రదంగా నిర్వహించే స్వయం ఉపాధి. భవిష్యత్తులో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

# సౌకర్యాల కల్పన.. రైతన్నకు సాంత్వన



వికారాబాద్ : ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహక చర్యలు చేపట్టింది. మిగతా జిల్లాల కంటే వికారాబాద్ జిల్లాలో వరి పంట 20 రోజుల ఆలస్యంగా చేతికొస్తుంది. ప్రభుత్వ ఆదేశాలతో అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా ఈనెల 3వ వారంలో కేంద్రాల ఏర్పాటుకు జిల్లా పౌర సరఫరాల శాఖ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర మద్దతు ధరను చెల్లించేలా చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే మద్దతు ధరల గోడ పత్రికలను జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశారు. ధాన్యం ముందుగా వచ్చే మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆయా కేంద్రాల వద్ద రైతులకు ఎదురైన సమస్యలు, కేంద్రాల్లో ఏర్పాటుచేయాల్సిన సౌకర్యాలపై కథనం.

దెబ్బతీసిన వర్షాలు

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి వర్షాలు సకాలంలో కురవలేదు. రైతులు బోర్లు, బావుల కింద పండించేందుకు యత్నించారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన అకాల భారీ వర్షాలతో పలుచోట్ల తెగుళ్లు సోకాయి. ఫలితంగా గతంలో కంటే దిగుబడి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 107 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 100 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం విక్రయానికి రాకుండా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించాం.

లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.

ఇలా చేయాలి

కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం కల్పించాలి.

తూకాల్లో మోసాలను అరికట్టాలి.

నిర్దేశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో తూకం వేయకూడదు.

కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలి.

అవసరమైతే రక్షణ కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.

గన్నీ బస్తాల కొరత ప్రతిసారీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

డిమాండ్‌కు సరిపడా పంపిణీ చేయాలి.

ధాన్యం విక్రయించిన అనంతరం కనీసం 48గంటల్లో ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

విక్రయాల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రాల వద్ద ఏఈఓలు అందుబాటులో ఉండాలి.

మద్దతు ధరలు... (రూ.క్వింటాలుకు)

ఎ గ్రేడ్ రకం.. 2320

సాధారణ రకం.. 2300

సన్నరకానికి బోనస్ రూ.500


ఖరీఫ్ సాగు.. (ఎకరాలు)

సాధారణ.. 99,000

సాగైంది.. 85,000

దిగుబడి అంచనా.. లక్ష మెట్రిక్ టన్నులు

# గృహ లబ్ధికి ఇందిరమ్మ కమిటీలు



వికారాబాద్ : నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజక వర్గానికి 3500 ఇళ్ల కేటాయించనున్నారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియమాకానికి గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తారు. వీరికి స్థానం కల్పిస్తారు: జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 14 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు.

పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు చొప్పున పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీలో భాగస్వామ్యం అవుతారు.

పురపాలిక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.

అన్నీ పారదర్శకంగా సాగుతాయి: రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్

ఇళ్లకు సంబంధించిన పనులన్నీ పారదర్శకంగా సాగుతాయి. వికారాబాద్ పురపాలిక సంఘంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక చేస్తున్నాం. వార్డుకు 7 మంది సభ్యులతో కమిటీ నియమిస్తాం. వార్డులన్నింటిలో కమిటీలను ఏర్పాటు చేస్తాం.

జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566

ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు.. 7

మొత్తం సభ్యులు .. 3,962

4 పురపాలికల వార్డు కమిటీల్లో సభ్యులు : 679

గ్రామాల్లో 566 పట్టణాల్లో 97

ఇవీ నిబంధనలు

పేద మధ్య తరగతి వారై ఉండాలి.

జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.

అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం.

ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.

సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

# బ్యాలెట్ పెట్టెలు సిద్ధమేనా?

పెద్దపల్లి : పంచాయతీ ఎన్నికల్లో కీలకమైనా బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలల్లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాల్లోని గోదాంలలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెలను సరి చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లు సమీపిస్తుండటంతో వీటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా? చెడిపోయయా? అనేది తేల్చే పనిలో ఉన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేస్తున్నారు. పెరగనున్న వార్డులు 2018-19 పంచాయితీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీల్లో 11,132 వార్డులున్నాయి. ప్రతి వార్డులో 250 ఓటర్లు ఉంటారు. ఎన్నికల్లో వార్డుకొక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఉమ్మడి జిల్లాలో వార్డుల సంఖ్య పెరగనుంది. జిల్లాల వారీగా పెరిగిన ఓటర్ల ఆధారంగా వార్డుల లెక్కలను కొలిక్కి తేనున్నారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెలు ఎన్ని? చెడిపోయిన ఎన్ని? అని తనిఖీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు తీసుకెళ్లిన బ్యాలెట్ పెట్టెలపై ఆరా తీస్తున్నారు. వీటిని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నారు. బ్యాలెట్ పెట్టెలు పక్కదారి పక్కకుండా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రకటన లోపు అన్ని ఏర్పాటు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.





రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ గత భారాస ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదేళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లు ఉంటాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అదే చట్టాన్ని కొనసాగిస్తుందా? కొత్త రిజర్వేషన్లు తీసుకొస్తుందా? అన్న దానిపై ఉత్కంఠ వీడటం లేదు. ఓ వైపు బీసీ కులగణన చేయాలని సంబంధ సంఘాల నేతలు పట్టుబట్టడంతో ప్రభుత్వం సర్వే చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయా వర్గాల వారు డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

# చిగురిస్తున్న ఆశలు

ఆలేరు : సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాలలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. సాగులో దున్నడం మొదలు పంటనూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. రాయితీపై వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఏటా రూ.600 కోట్లు ఖర్చునకు సిద్ధం

వ్యవసాయశాఖ పరంగా ఇప్పటికే రైతుబంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన



పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఏటా రూ.60 కోట్లకు పైగా నిధుల కేటాయింపు జరగనుంది. రోటోవేటర్లు, మూడుకాళ్ల నాగళ్లు, ఆఫ్‌కేజీ చక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు లాంటివి రాయితీపై అందనున్నాయి.

తప్పనున్న కొనుగోలు'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచార లోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.

# గడపకో.. ఉద్యోగి..!

మిర్యాలగూడ : ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న ఆ వీధిలో ఒకప్పుడు కూలీలు, తాపీ పని చేసే వారు మాత్రమే ఉండేవారు. పలువురికి వ్యవసాయ భూములున్నప్పటికీ సాగు చేసేందుకు నీటి సదుపాయం లేక కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. అత్యధికులు తాపీపని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని వృద్ధి చేసుకున్నారు. తాపీ కూలీలు.. మేస్త్రీలుగా మారారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడం మొదలుపెట్టారు. పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినోభా బావే పేరుతో ఏర్పడిన ప్రస్తుత 36వ వార్డులోని వినోభా నగర్ నేడు విద్యాధికుల కాలనీగా మారింది. 2005 నుంచి ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగుల సంఖ్య సైతం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 300 కుటుంబాలున్న ఆ కాలనీలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, మరో వంద మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.

అటు ఉద్యోగం.. ఇటు వ్యవసాయం

ఈ కాలనీకి చెందిన ఇద్దరు పోలీస్ శాఖలో సీఐలుగా, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులుగా పనిచేస్తున్నారు. ఐదుగురు డాక్టర్లు, 30 మంది ఉపాధ్యాయులు, పరిశ్రమల శాఖలో ఒకరు, డీసీటీవోలో ఒకరు, వ్యవసాయ శాఖ ఏడీ ఒకరు, విద్యుత్తు ఏడీఈ ఒకరు, నీటి పారుదల శాఖలో ఇద్దరు ఏఈలు, మరో ముగ్గురు ఉద్యోగులు, నర్సులు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు, వివిధ శాఖల్లో సీనియర్, జూనియర్ సహాయకులు పది మంది, అటెండర్లు 20 మంది ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20 మంది పనిచేస్తున్నారు. మరో 80 మంది వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 250 మందికి పైగా ఉద్యోగులు ఉండగా.. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం చేస్తున్నారు.

తాపీ పనిచేస్తూ చదివించారు.. – కోడిరెక్క రవికుమార్, విద్యుత్తు ఏడీఈ, మిర్యాలగూడ



అమ్మానాన్నలు కోడిరెక్క దోర్నీసు, సుక్కమ్మలు. నాన్న తాపీ పని చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. ఎంటెక్ పూర్తి చేసి విద్యుత్తు శాఖలో ఏడీఈగా పని చేస్తున్నా. మా పెద్ద చెల్లి రాధ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న చెల్లి వినయరాణి హైదరాబాద్‌లో డాక్టర్, తమ్ముడు వినోద్ కెనడాలో దంత వైద్యుడిగా పని చేస్తున్నారు. అమ్మానాన్న చదువు విలువ తెలుసుకుని ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు.

ఇంటికి ఇద్దరు పట్టభద్రులే– కోడిరెక్క శైలజ, పంచాయతీ కార్యదర్శి, తక్కెళ్లపాడు, మిర్యాలగూడ మండలం

నాన్న కోడిరెక్క మల్లయ్య తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే మాకు ఏ లోటు రాకుండా ఉన్నత చదువులు చదివించారు. ఎం.ఫార్మసీ పూర్తి చేసి 2019 నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. సోదరి వసంత పట్టణంలోనే వైద్యురాలు. సోదరుడు నాగేందర్ డీసీటీవోగా పని చేస్తున్నారు. చదువు విలువ తెలుసుకున్న తలిదండ్రులు మేము ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు. మా కాలనీలో ఇంటికి ఇద్దరు పట్టభద్రులు, ఇంటికొక్కరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

# ఎంబిబిఎస్ లో సీటు పొందిన హుదా హైస్కూల్ విద్యార్థినికి అభినందన



కరీంనగర్, అక్టోబర్ 16(ప్రభాత సమాచారం):నగరంలోని ఉస్మాన్పుర లో గల హుదా హై స్కూల్ విద్యార్థిని ఫిజ్జా ఫాతిమా నీట్ లో ర్యాంక్ సాధించి సిరిసిల్ల మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు పొందిన నేపథ్యంలో హుదా హైస్కూల్ కార్యాలయంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు స్కూల్ యాజమాన్యం అభినందించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ గత 22సంవత్సరాలుగా నగరంలో పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ, వారి విద్యపరమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేసేందుకు, అన్ని రకాలుగా తోడ్పాటు నందిస్తూన్న హుదా హైస్కూల్ యాజమాన్యన్నీ అభినందించారు. హుదా హైస్కూల్ లో విద్యార్థులకు పునాది దశ నుంచే ఉన్నతమైన క్రమశిక్షణ, మానవతా విలువలను నేర్పిస్తూ.. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునే లక్ష్య సాధనలో భాగంగా నిష్ణాతులైన ఇంజనీర్లుగా, డాక్టర్ లుగా రాణిస్తున్నారని చెప్పారు. ఫిజ్జా ఫాతిమా భవిష్యత్తులో మంచి డాక్టర్ గా పేద ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హుదా హైస్కూల్ అధ్యక్షుడు అహ్మద్ అబ్దుల్ అజీమ్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రౌఫ్ ఖాలీద్ లతీఫీ, సెక్రటరీ కరస్పాండెంట్ అబ్దుల్ రబ్ ముజాహిద్ లతీఫీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికి రుణమాఫీ చేసి తీరుతాం : మంత్రి తుమ్మల




నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే 31 వేల కోట్ల రూపాయల రైతుల రుణమాఫీని చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..గడచిన 5 సంవత్సరాలలో రైతుకు ఏ బ్యాంకులో ఎంత బాకీ ఉన్నా రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం తీసుకుందని తెలిపారు. క్యాబినెట్ నిర్ణయం ప్రకారం 22 లక్షల తెల్ల కార్డులు కలిగిన రైతులకు ఇది వరకే 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తూ వారి ఖాతాలలో నగదు జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాలలో రుణమాఫీ డబ్బులు జమ చేస్తామని పేర్కొన్నారు. 2 లక్షల రూపాయల పైన రుణాలు ఉన్న రైతులకు కూడా రుణాలు మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీని చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు.

# గుండు సున్నా చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్లో హరీశ్ రావు ఇష్టాగోష్టిగా విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చిన పథకాలను బంద్ చేయడమే కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు అని వ్యంగ్యంగా అన్నారు. గతంలో దసరా, బతుకమ్మ పండగల వేళ.. ఒక చీర కాదు.. రెండు చీరలు ఇస్తామన్నాని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పండగ వేళ.. అక్కచెల్లెమ్మలను నిరుత్సాహపరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు కింద రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించి.. అవి ఇవ్వకుండా గుండు సున్నా చుట్టాడని విమర్శించారు. కేసీఆర్ కిట్ కంటే మంచి కిట్ ఇస్తామని చెప్పి.. పేద గర్భిణీలను సైతం మోసం చేశాడని చెప్పారు. ముదిరాజ్, గంగాపుత్రులంటే సీఎం రేవంత్ రెడ్డికి చిన్నచూపు అని ఆయన ఆరోపించారు. ఆగస్టులో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చిన పోయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము రూ. 100 కోట్లు ఖర్చు చేస్తే.. ఈ రేవంత్ సర్కార్ చేప పిల్లల కోసం బడ్జెట్లో పెట్టింది.. కేవలం రూ .16 కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. వర్షా కాలంలో చెరువులు నిండుకుండలా ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ చేప పిల్లల సగమే పోయాలంటున్నారని రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పు అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరి 10 మాసాలు దాటింది. అయితే రాష్ట్రంలో సంక్షేమ



పథకాలు అమలులో ఈ సర్కార్ తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తుందని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాగే తెలంగాణలో చెరువులు, నాలలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుంది. అందులోభాగంగా హైడ్రాను ఏర్పాటు చేసింది. అయితే ఈ హైడ్రా కారణంగా మధ్యతరగతి, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ రేవంత్ సర్కార్పై బీఆర్ఎస్ నేతల నిప్పులు చెరుగుతున్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుపై సైతం ఈ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు.. అధికార కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరుగుతున్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# నెలాఖరులోగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు : పొంగులేటి

కూసుమంచి: ఖమ్మంలో నెలాఖరులోగా రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ నిచ్చారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లిలో బుధవారం కల్యాణ లక్ష్మి, సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు 4 వేల ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమానికి ఇందిరమ్మ రాజ్యం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సీతారాములు పాల్గొన్నారు.




# సిద్దిపేటలో ఔరా అనిపిస్తోన్న అక్కాచెల్లెళ్లు.. ఒకేసారి..

సిద్దిపేట: జిల్లాకు చెందిన అక్కాచెల్లెళ్లు అద్భుతం చేశారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా నలుగురు అక్కాచెల్లెళ్లు వైద్యులుగా మారేందుకు సిద్ధమయ్యారు. సిద్దిపేట పట్టణం నర్సాపూర్కు చెందిన కొంక రామచంద్రం (శేఖర్), శారద దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. రామచంద్రానికి రాజు అనే సోదరుడు ఉండేవాడు. అయితే అతను 1992లో జరిగిన ఓ రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఆ తర్వాత ఆయన తల్లి మల్లవ్వ గొంతు క్యాన్సర్తో మృతిచెందారు. దీంతో రామచంద్రం తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తన ఇంట్లో ఒక్క డాక్టరైనా ఉండి ఉంటే తల్లి, సోదరుడిని కాపాడుకునే వాడిని కదా అనుకున్నారు. తన నలుగురు పిల్లల్లో ఒక్కరినైనా వైద్యురాలిని చేయాలని సంకల్పించారు. ఏళ్ల తరబడి భార్యభర్తలు ఇద్దరూ దర్జీలుగా పని చేస్తూ పిల్లలను బాగా చదివించారు. అయితే పెద్ద కుమార్తె మమత ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిగా చేసింది. రెండో కుమార్తె మాధురి కరీంనగర్లోని చెల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో తుది సంవత్సరం చదువుతోంది. మరో ఇద్దరు పిల్లలు రోహిణి(అక్క), రోషిణి (కవలలు) సైతం తాజాగా ఎంబీబీఎస్ సీటు సాధించి ఔరా అనిపించారు. నీట్- 2024లో రోహిణికి 536 మార్కులు రాగా, రోషిణికి 587 మార్కులు వచ్చాయి. వీరిద్దరూ జగిత్యాల మెడికల్ కళాశాలలో సీటు సాధించారు. నీట్- 2023లోనే రోహిణికి సీటు వచ్చింది. అయితే రోషిణికి మాత్రం రాలేదు. దీంతో చెల్లి బాధపడుతుం దని ఆమె కళాశాలలో చేరలేదు. ఇద్దరూ కలిసి ఈసారి అదరగొట్టారు. మంచి మార్కులు సాధించి ఒకే కళాశాలలో సీటు పొందారు. త్వరలో నలుగురూ డాక్టర్లు కాబోతుండడంతో తల్లిదండ్రులు, బంధువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అయితే తమను చదివించేందుకు తల్లిదండ్రులు చాలా కష్టపడుతున్నారని, వారి నమ్మకాని ఒమ్ము చేయబోమని అక్కాచెల్లెళ్లు చెప్తున్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా వారు మా ఇష్టాన్ని కాదనకుండా ఎంబీబీఎస్ చదవిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ ముగ్గురికీ పెద్ద అక్కనే రోల్ మోడల్ అంటున్నారు. అందరం కలిసి అమ్మానాన్న కల సాకారం చేస్తారని చెప్తున్నారు. పిల్లలు హైదరాబాద్లో చదవడంతో చాలా మంది అనేక రకాల మాటలు అనేవారని, వాటిని పట్టించుకోకుండా లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు రామచంద్రం దంపతులు అంటున్నారు. తమ పిల్లలను సరస్వతీ పుత్రులు అని పలువురు కొనియాడుతున్నారని, ఆ మాటలు వింటున్నప్పుడు తమ కష్టాన్ని మర్చిపోతున్నట్లు ఆనంద భాష్పాలు రాల్చారు. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా వారిని డాక్టర్లగా నిలబెడతామని అంటున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఈ కుటుంబం గురించే చర్చ జరుగుతోంది. పిల్లలు అంటే ఇలా ఉండాలని పలువురు తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

# రైతు సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం కృషి : మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ : రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపం లోని ఎస్ఎల్బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎల్బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375



కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రా లు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

# సాఫ్ట్వేర్ ఇంజినీర్పై లైంగికదాడి.. ఆటో డ్రైవర్ను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ : గచ్చిబౌలిలో సోమవారం అర్ధరాత్రి ఓ యువతిపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్ఫోన్ నెంబర్ ఆధారంగా కేసును పోలీసులు ఛేదించారు. లైంగికదాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ ప్రవీణ్ను అరెస్ట్ చేశారు. ప్రవీణ్ను శేరిలింగంపల్లి గోపీనగర్లో అదుపులోకి తీసుకున్నారు. ప్రవీణ్ నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, సైబరాబాద్ ఐటీ కారిడార్ మంగళవారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అత్యంత సేఫ్జోన్గా భావించే గచ్చిబౌలిలో సోమవారం అర్ధరాత్రి ఓ యువతిపై ఆటో డ్రైవర్, తన స్నేహితుడితో కలిసి లైంగికదాడి చేయడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన పోలీస్శాఖ పనితీరుపై మరోసారి విమర్శలకు తావిచ్చింది.



# సీఎం రేవంత్ను కలిసిన దేవిశ్రీప్రసాద్



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కలిశారు. జూబ్లీహిల్స్లోని సీఎం నివాసంలో ఆయనతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ నెల 19న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న మ్యూజిక్ కాన్సర్ట్కు రేవంత్, భట్టివిక్రమార్కను దేవిశ్రీ ప్రసాద్ ఆహ్వానం పలికారు. ఆయనతో పాటు నిర్మాత బండ్ల గణేశ్ ఉన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660